క్లుప్తంగా

గట్టికల్‌లో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని గట్టికల్ గ్రామంలో సూర్యాపేటకు చెందిన ఆర్వి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 200మందికి ఉచితంగా ఈసీజీ, రక్త పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు ప్రియాంక, రవికుమార్, బెల్లంకొండ రాంమూర్తి, రాచకొండ సురేష్, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మైకులు, డీజే బాక్సుల బహూకరణ



దాతను సన్మానిస్తున్న అర్చకుడు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి రూ.50వేల విలువచేసే మైకులు, డీజే బాక్సులను అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు తిరునగరి పద్మనాభస్వామి–రమావతి దంపతులు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో దాత పద్మనాభస్వామిని అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్‌లు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తొండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య విద్యలో భాగంగా విద్యార్థులకు బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సరళ, మమత, మండల విద్యాధికారి శాంతయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళీ, మల్లిఖార్జున్, జానిబేగం, అనితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

యాదయ్య మృతి పార్టీకి తీరనిలోటు



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మద్దిరాల : పాల్వాయి యాదయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు తీకుల సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన పాల్వాయి యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య రాములమ్మకు రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి వెంకటయ్య, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య, నారాయణరెడ్డి, బోనగిరి సీతారాములు, నర్సయ్య, మధు, మోహన్ ఉన్నారు.

సర్పంచ్‌పై ఎంపీడీఓకు ఫిర్యాదు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామ సర్పంచ్ శ్యామలేటి కోటేష్ తన ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీ నికర ఆస్తులను దుర్వినియోగం చేశారని గ్రామస్తులు బుధవారం మండల అభివృద్ధి అధికారి హరిసింగ్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన సిరికొండ వాగులో తాగు నీటి బోరును అమ్ముకున్నాడని, పాత గ్రామ పంచాయతీ కార్యాలయానికి చెందిన వేప చెట్లు విక్రయించి పాత గ్రామ పంచాయతీకి రేకులు వేయిస్తానని చెప్పి వేయించలేదని, గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామంలో జియో టవర్ ఏర్పాటు చేయించాడని, శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించలేదని, అందులో మరుగు దొడ్లకు నీటి సరఫరా చేయించడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కి అనేకసార్లు విన్నవించుకున్నా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఎంపీడీఓ సమక్షంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోట సుధాకర్‌రెడ్డి, గునగంటి రమేష్, కుంచ గోపి, తండు సంజీవ, వెంకటరెడ్డి, వి.వెంకన్న, ఖాసీం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

‘హైవే’ల వెంట మద్యం జోరు

- నిబంధనలకు విరుద్ధంగా వైన్స్‌లు, బెల్ట్‌దుకాణాల నిర్వహణ
- పేరుకు ఫ్యామిలీ దాబాలు.. లోపల అంతా మద్యం మయం
- మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు



జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న వైన్స్‌షాపు



రహదారి పక్కన ఉన్న దాబాలో సాగుతున్న మద్యం విక్రయాలు

సూర్యాపేట క్రైం : పలు జాతీయ రహదారుల వెంట మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతోపలువురు వాహనదారులు మద్యం మత్తులో ప్రమాదాల బారిన పడి మృత్యువాతపడుతున్నారు. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం రహదారుల వెంట వైన్స్‌లు, బెల్టుదుకాణాలు ఏర్పాటు చేయడమే అని అంటున్నారు పలువురు వాహనదారులు. దీంతో ప్రమాదాల నివారణకు గతంలో ప్రభుత్వం హైవేకు 500మీటర్ల దూరంలో వైన్స్‌లు నిర్వహించాలని నిబంధనలు విధించింది. అది పట్టించుకోకుండా పలువురు నిర్వాహకులు వైన్స్‌లు, బెల్టుదుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలతో రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. అదే విధంగా రోడ్లవెంట ఏర్పాటు చేసిన దాబాల్లో, హోటళ్లలో కూడా బయటి నుంచి మద్యం తెచ్చి సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి జోరుగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఎక్సైజ్, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ కింద ప్రతి ఏటా కేసులు నమోదు చేస్తున్నా.. మరి దాబాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మద్యం విక్రయాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు శూన్యం.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు..

సూర్యాపేట పట్టణం, సూర్యాపేట మండల పరిధిలోని అంజనాపురి కాలనీ, గాంధీనగర్, జనగామ క్రాస్‌రోడ్డు, రాయినిగూడెం, తిరుమలగిరి, చివ్వెంలలో అనధికారికంగా నడుస్తున్న దాబాల్లో, హోటళ్లలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. జనగామ క్రాస్‌రోడ్డులో పదుల సంఖ్యలకు పైగా దాబాలు, హోటళ్లు ఉన్నాయి. వాటిలో నిర్వాహకులు మద్యం అమ్మకాలు సిట్టింగ్‌లు చేయిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకు దాబాల్లో, హోటళ్లు తెరిచే ఉంచి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా ఈ ఏడాదిలో ఒక్క జనగామ క్రాస్‌రోడ్డు, అంజనాపురి కాలనీ క్రాస్‌రోడ్డులోనే మద్యం సేవించి ప్రమాదాలకు గురై పది మందికి పైగా మృత్యువాత పడ్డారు.

రోడ్డు దిగితే మద్యం..

వైన్‌షాపులు, బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా ప్రధాన రహదారుల వెంబడి వెలిశాయి. దీంతో వాహనదారులకు రోడ్డు దిగితే మద్యం అందుబాటులో ఉంటుంది. అయితే ప్రధాన రహదారులకు కనీసం 500మీటర్ల దూరంలోనే వైన్స్, బెల్ట్ దుకాణాలు ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ నిర్వాహకులు ఇవేమీ తమకు వర్తించవన్న దోరణిలో ఆయా దుకాణాలు నడుపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్ల వెంట మద్యం విక్రయాలు చేస్తున్న దాబాలు, హోటళ్లలో బెల్ట్‌షాపుల్లో, వైన్స్‌ల్లో మద్యం అమ్మకాలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలో పారిశుద్ధ్యంగా అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో, ఉన్నా సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగునీరు చేరి దర్శనమిస్తుంది. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో ఇళ్ల మధ్యలోకి మురుగు నీరు వెళుతోంది. ఈ ప్రాంతంలో రెండు సంవత్సరాలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న చోట కూడా డ్రెయినేజీ అధ్వానంగా, దుర్వాసన వస్తుండడం మున్సిపల్ పాలకవర్గం, అధికారుల తీరుకు నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సిబ్బంది తక్షణమే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.





సూర్యాపేటలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఇళ్ల మధ్య చేరిన మురుగు, డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

కుటుంబాలకు పరామర్శ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన ఇరుగు యల్లమ్మ, నల్లగంటి మదారమ్మలు అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. దీంతో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు తాటిపాముల జలంధర్, మామిడి సత్యనారాయణ, బింగి కృష్ణమూర్తి, రింగు నరహరి, నర్సింగ కిష్టయ్య, దేవరకొండ రాంమూర్తి, సైదులు, విజయ్, ఉదయ్‌లు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించారు.

బడి బయట పిల్లల గుర్తింపు సర్వే



తుంగతుర్తి : బండరామారంలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ



నాగారం : పసునూర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న సీఆర్పీ స్వామిగౌడ్

తుంగతుర్తి : మండల పరిధిలోని బండరామారం, సూర్యతండాల్లో బడి రాకుండా బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు క్లస్టర్ సీఆర్పీ బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బడి బయట పిల్లలను, మధ్యలో బడిమానేసిన పిల్లలు, నెలరోజులకు పైగా తరగతులకు హాజరు కాకుండా ఉన్న వారి వివరాలను తెలుసుకొని ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని పసునూర్, డి.కొత్తపల్లి గ్రామాల్లో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు క్లస్టర్ సీఆర్పీలు బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించడంతో పాటు పాఠశాలలకు వెళ్లని వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బడి బయట పిల్లల్ని, మధ్యలో బడిమానేసి పిల్లల, నెల రోజులకు పైగా తరగతులకు హాజరు కాకపోయినా పిల్లల వివరాలను తెలుసుకొని ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు స్వామిగౌడ్, హరిప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కుంచమర్తి, అడివెంల గ్రామాల్లో బుధవారం ఐఈఆర్పీలు వినీత, ఇందు బడి బయట ఉండే, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి బయట పిల్లల కోసం నెలరోజుల పాటు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

నూతనకల్ : సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విజయమేరి ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరాల విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ నంబర్లను ఎత్తరాదని వారికి ఎలాంటి వ్యక్తిగత సమాచారం అందించొద్దన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తుల సమాచారాన్ని 1932కు ఫోన్ చేసి అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

తుంగతుర్తి : మాదకద్రవ్యాలు రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన సందర్శించి మాట్లాడారు. మాదకద్రవ్యాలు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ప్రపంచ మానవాళి పురోభివృద్ధికి పెను బూతాలైన గంజాయి బ్రౌన్‌షుగర్, కొకైన్ లాంటి మాదకద్రవ్యాల వినియోగంతో ప్రజల ఆరోగ్యానికి హానీ జరుగుతుందన్నారు. యువత చెడు అలవాటకులోను కాకుండా సక్రమమైన మార్గంలో నడవాలన్నారు. మాదకద్రవ్యాలు రవాణా చేసే వారి వివరాలను పోలీసులకు తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. లేకుంటే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపు, ఓటములు సహజమని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరి పట్టణంలో బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధికి పది సంవత్సరాలు కృషి చేశానని, నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలవాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ఎండగట్టాలన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు ఏచిన్న సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. 2004 సంవత్సరం నుంచి 2014 సంవత్సరం వరకు మైనింగ్ ద్వారా ఆదాయం ప్రతి సంవత్సరం రూ.5కోట్ల నుంచి రూ.10కోట్ల మాత్రమే వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మైనింగ్ ద్వారా రూ.5వేల కోట్ల రెవెన్యూ వచ్చిందని వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణాపై సోషల్ మీడియాపై అసత్య ప్రచారం నిర్వహించారని అన్నారు. పార్టీ భవిష్యత్‌కు అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.రఘునందన్‌రెడ్డి, ఉప్పలయ్య, తాటికొండ సీతయ్య, అర్వపల్లి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డికి ఘన నివాళి



సూర్యాపేట : అన్నదానం చేస్తున్న రమేష్



తుంగతుర్తి : ప్రతీక్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుంగతుర్తిలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ..

తుంగతుర్తి : మండల కేంద్రంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి 12వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు దొనకొండ రమేష్ మాట్లాడుతూ.. ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక వసతుల కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ మౌనిక, సర్పంచ్ నకిరేకంటి విజయ్, పార్టీ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, రాములు, యాకన్న, సతీష్, లింగయ్య, వెంకటేశ్వర్లు, లింగయ్య, జలేందర్, నాగయ్య, మల్లయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి వర్ధంతి

సూర్యాపేట : పట్టణంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి 12వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుడకుడలో గల అన్నపూర్ణ అనాథాశ్రమంలో మానసిక వృద్ధులు, దివ్యాంగులకు దొనకొండ రమేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రేసు రాములు, ఓర్సు వెంకన్న, సూర విజయ్, రేసు నాగయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైట్ల పునరుద్ధరణ

అర్వపల్లి : అర్వపల్లిలోని సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై వారం రోజులుగా సెంట్రల్ లైట్లు వెలగక అంధకారంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి బుధవారం కలెక్టర్‌కు ఫోన్‌చేసి లైట్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యను అర్వపల్లికి పంపించారు. ఆయన తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీఓ సందీప్‌లతో కలిసి విద్యుత్ ఎస్ఈ, డీఈఈ, ఏఈఈలతో మాట్లాడి లైట్లను పునరుద్దరింపచేయించారు.

ఆలయంలో కుంకుమార్చన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మహిళలు గోదాదేవికి కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే కీర్తనలతో స్వామిని స్మరించారు. కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ముమ్మరంగా ‘యాసంగి’ పనులు

- వరిసాగుకే రైతన్న మొగ్గు
- 19వేల ఎకరాల్లో సాగు అంచనా
- ఎస్సారెస్పీ నీటిపైనే ఆశలు



నాగారంలో నాట్లు వేస్తున్న మహిళలు



నాగారంలో పొలం దున్నుతున్న రైతు

నాగారం : మండలంలో యాసంగి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే రైతులు వరిసాగుకు ఎక్కువగా మొగ్గు చూపుతూ వరినార్లు పోసుకొని, పొలాలను దున్ని, నాట్లు వేసే పనిలో బీజీగా మారారు. మండలంలో గత వానాకాలం సీజన్‌లో 18వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా, ప్రస్తుత యాసంగి సీజన్‌లో 19వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో బావుల కింద ముందస్తుగా వరినార్లు పోసిన వారు ప్రస్తుతం నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఎస్సారెస్పీ నీటిపైనే ఆశలు..

మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు 19వేల ఎకరాల్లో వరిపంటను సాగుచేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ యాసంగికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయలేదు. దీంతో రైతులు ఎస్సారెస్పీ నీటి కోసం ఎదురుచూస్తున్నారు. కాగా ఎస్సారెస్పీ నీటిని జనవరి మొదటి వారం నుంచి విడుదల చేస్తామని అధికారులు చెబుతుండటంతో రైతులు నీరాశచెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో యాసంగి పంటలకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి చెరువులను, కుంటలను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డ్రమ్‌సీడర్‌కే రైతుల మొగ్గు..

యాసంగిలో కూలీల కొరతను అధిగమించడం, నాట్ల ఖర్చును తగ్గించుకోవడానికి రైతులు నాట్లను వదిలి డ్రమ్‌సీడర్ పద్ధతికి మొగ్గు చూపుతున్నారు. మూడేళ్లుగా డ్రమ్‌సీడర్ విధానంతో సాగు చేసిన వారి పంటలు అధికదిగుబడి వస్తుండడంతో పాటు ఇతర లాభాలు ఉండటంతో మండలంలో 40శాతం మంది రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. డ్రమ్‌సీడర్ పద్ధతితో ఎకరాకు దాదాపు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చులు తగ్గుతున్నాయి. అంతే కాకుండా డ్రమ్‌సీడర్ విధానాలతో మొక్క పిలకలు ఎక్కువగా రావడంతో పాటు వేర్లు బలంగా ఉండి దిగుబడి ఎక్కువగా వస్తున్నట్లు పలువురు రైతులు అంటున్నారు. డ్రమ్‌సీడర్ పద్ధతితో పంట 15–20 రోజుల ముందే పంట చేతికొస్తుండటం, కూలీల ఖర్చు తగ్గుతుండటంతో రైతులు ఈ పద్ధతికే ఆసక్తి చూపుతున్నారు.

అధికారుల సలహాలు తీసుకోవాలి



“వరిసాగు చేసే రైతులు తగిన జాగ్రత్తలతో పాటు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. యాసంగిలో తప్పని సరిగా దుక్కిలో జింక్ వేసుకోవాలి. జింక్ వేయడంతో మొక్క గిడసబారకుండా ఉంటుంది. అలాగే రైతులు నాటు వేయడానికి వారం రోజుల ముందు నారుమడిలో గులికలు చల్లుకోవాలి. అధికారుల సూచనలతో పంటసాగు చేస్తే దిగుబడి అధికంగా వస్తుంది.

– పెందోట గణేష్, ఏఓ, నాగారం

మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని వినతి



తిరుమలగిరి (తుంగతుర్తి) : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని, తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకు మాత్రమే బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పేరాల శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేదలైన పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఆటో కార్మికులకు నెలకు రూ.3వేల ఆర్థికసాయం అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బాలస్వామి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డు కలిగిన మహిళలకు మాత్రమే ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు, సంపన్నులకు ఈ బస్సు సౌకర్యం నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.3వేల గౌరవ వేతనం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వినీత్, కోకన్వీనర్ యాకేష్, లింగన్న, గణేష్, ప్రశాంత్, సుధాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.